"మా ఫ్రెండ్ శాంతి నీకు లైనేస్తోంద న్నయ్యా" అంది శ్యామల.

"అంటే?" ఆశ్చర్యంగా అడిగాడు శ్యాంబాబు.

"ప్రేమిస్తోందిట. నీకు నచ్చితే వాళ్ల వాళ్లను పంపి పెళ్లి సంబంధం మాట్లాడతారన్న మాట"

"ఆ అమ్మాయికి నేనెలా తెలుసు?"

"మనం చిన్నప్పుడు ముత్యాలంపాడులో కామేశం మాష్టారింట్లో అద్దెకుండేవాళ్లం గుర్తుందా? మాష్టారి తండ్రి అవధానిగారిని హెడ్మాష్టరుగా చేసి రిటైరయ్యారు. అప్పుడు నువ్వు టెంత్ క్లాస్ చదివేవాడివి. డౌట్స్ ఆయన్ని అడిగి చెప్పించుకునేవాడివి గుర్తుకొచ్చిందా?"

"గుర్తుకొచ్చిందిలే... ఆయన మనవరాలు శాంతి నీ ఫ్రెండ్."

"ఇప్పుడు ఇద్దరం శారదా కాలేజీలోనే చదువుతున్నాం. మనం సత్యన్నారాయణపురంలో ఇల్లు కొనుక్కుని వచ్చేసిన తరువాత కూడా అప్పుడప్పుడు మన ఇంటికి వస్తుండేది. ఒకసారి మేము ఇంట్లో లేకుండా చూసి నీమీద దాడి చేసి నీ అభిప్రాయం కనుక్కుంటుందిట."

"దాడి చేయడమంటే కరుస్తుందా?" అన్నాడు శ్యాంబాబు. పకపకా నవ్వింది శ్యామల.

***

"నా పేరు శాంతి. కామేశం మాస్టారు అమ్మాయిని. శ్యామల ఇంట్లో లేదా?" నవ్వుతూ అడుగుతున్న అమ్మాయిని కళ్లప్పగించి చూస్తూ చెల్లెలు చెప్పిన మాటలు గుర్తుకొచ్చి "లోపలకు రా" అని ఆహ్వానించాడు. ఒక గంట కాలం గడిచిపోయిన సంగతి గుర్తించలేదు. నూటికి ఎనభై మార్కులు వేసాడు శ్యాంబాబు.

"ఇంక వెడతాను. ఇంటికి వెళ్లగానే 'ఆడపిల్లలు చీకటి పడేవరకూ బయట తిరగకూడదు' అంటూ సూక్తిముక్తావళి చదువుతాడు ముసలాడు" అంది.

"ముసలాడు ఎవరు?"

"మా తాతయ్య" అంది నవ్వుతూ.

శ్యాంబాబు మనసంతా పాడైపోయింది. ఆయన బయట ఎదురైతే ఎవరైనా చేతులెత్తి 'నమస్కారం మాస్టారు' అంటారు.రెండు మంచి మాటలు చెప్పినందుకు ఎంత తేలిగ్గా మాట్లాడింది. రేపు అమ్మానాన్నలని ఇలా అంటే తను తట్టుకోగలడా? ఆలోచనలో వున్న శ్యాంబాబు తల్లి, శ్యామల రావడం గమనించలేదు.

"శాంతికి ఎన్ని మార్కులు వేసావురా?" నవ్వుతూ అడిగింది శ్యామల.

"నూటికి ఇరవై మార్కులు" అన్నాడు చిరాగ్గా. ఉలిక్కిపడ్డారిద్దరూ.

"ఏం జరిగిందిరా?" ఆదుర్దాగా అడిగింది.

"మనిషి అందమైనదేగానీ మాట తీరు బాగా లేదు" జరిగిన సంగతి చెప్పాడు. "నీ ఫ్రెండ్స్ అందరూ ఇలాగే మాట్లాడతారా?"

"ఈ జనరేషన్‌లో అమ్మాయిలంతా ఇంతేరా?" నిట్టూర్చింది తల్లి.




"మా ఫ్రెండ్స్ అంతా కబుర్లు చెప్పుకునేటప్పుడు తాతగారు, మామ్మలనే కాదు, తల్లిదండ్రుల గురించి చెప్పేటప్పుడు కూడా కొంత మంది ఇలాగే మాట్లాడుతుంటారు. నేను వాళ్లని మందలిస్తూ ఉంటాను. అందుకని నన్ను బామ్మగారు అని ఎగతాళి చేస్తుంటారు" అంది.

***

శ్యాంబాబు చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. పిల్ల తల్లికి, కట్నం తండ్రికి నచ్చక చాలా సంబంధాలు జాతకం బాగాలేదనే వంకతో తప్పించేసారు. స్నేహితుడు చెల్లెలు పెళ్లికి హైదరాబాద్‌కు వెడుతూ నాలుగురోజులు తల్లిదండ్రులతో గడపాలని వచ్చాడు.

"వచ్చినవాడివి ఎలాగూ వచ్చావు. ఇద్దరు అమ్మాయిలను చూసి వెళ్లరా" అంది తల్లి.

"పెళ్లి నుంచి వచ్చాక చూస్తాను" అని చెప్పి చెన్నై వెళ్లిపోయాడు. మర్నాడే వస్తానని చెప్పి వెళ్లిన శ్యాంబాబు నాలుగురోజుల తరువాత వచ్చాడు. ఒక ఫోటో తల్లి చేతిలో పెట్టి "పిల్లని చూసాను. వాళ్లవాళ్లతో కట్నం వద్దని చెప్పేసాను. ఆ అమ్మాయి పెళ్లికూతురి ఫ్రెండ్. ఆ అమ్మాయి ప్రవర్తన, మాటతీరు నాకు బాగా నచ్చింది. నాలుగురోజులు అక్కడే ఉండి అన్ని విషయాలు తెలుసుకున్నాకే అఖిలని సెలెక్ట్ చేసాను. వాళ్ల బాబాయిగారు ఇక్కడే ఉన్నారుట. ఆ అమ్మాయిని వాళ్లు ఇక్కడికి తీసుకొస్తానన్నారు. నువ్వూ, నాన్నగారు వెళ్లి చూసి ముహూర్తాలు నిర్ణయించి శుభలేఖలు వేయించండి. నిశ్చితార్థాలూ అవీ వద్దు, టైమ్, డబ్బు రెండూ వేస్టు. మళ్లీ పెళ్లికి నాకు సెలవు దొరకదు" అని చెప్పి చెన్నై వెళ్లిపోయాడు శ్యాంబాబు.

***

నాలుగురోజుల తరువాత పిల్లని చూడడానికి భవానీపురంలో వున్న వాళ్ల బాబాయిగారింటికి వెళ్లాము. పిల్ల చామనఛాయ, గుండ్రని ముఖం, ముఖ్యంగా ముఖంలో చిరునవ్వు. పెద్దవాళ్లు అడిగిన ప్రశ్నలకు ఆమె చెప్పిన జవాబులు ఆ అమ్మాయి నూటికి నూరు మార్కులు తెచ్చిపెట్టాయి. ఎన్ని లక్షల కట్నమయినా ఇస్తామంటూ తిరుగుతున్న అమ్మాయిల తండ్రులకు ఇప్పుడు ఏం సమాధానం చెప్పాలి? అఖిల నవ్వు ఎన్ని లక్షల ఖరీదో? చిరునవ్వుతో గెలుచుకుంది మావాడిని.

★